ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

శనివారం 8 ఫిబ్రవరి 2025

విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీగా కుమారస్వామి



విజయనగరం, కలెక్టరేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులశాఖ సహాయ సంచాలకుడిగా కె.కుమారస్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లా పర్యాటక అధికారిగా ఆయన పని చేస్తున్నారు. దీనితో పాటు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీగా కూడా వ్యవహరించనున్నారు. ఈ శాఖ ఏడీ జగదీష్ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఆ బాధ్యతను పర్యాటక శాఖ అధికారికి అప్పగించారు.

అత్యవసర కేసా.. రెఫర్ చెయ్!

- వైద్యులు ఉండరు.. సేవలు అందవు
- స్థాయి పెరిగినా మారని తీరు
- గజపతినగరం సీహెచ్‌సీ తీరిదీ
- రాజాంలో అరకొర భవనాలే దిక్కు
- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు
- ఆరుబయటే విలువైన పరికరాలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

'అత్యవసర కేసు వచ్చిందా.. అయితే రెఫర్ చెయ్' అన్నట్లుగా తయారైంది గజపతినగరం సీహెచ్‌సీ తీరు. ఈ ఆసుపత్రి స్థాయి పెరిగినా.. ఆ స్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. వైద్యులు ఉన్నా సరిగా అందుబాటులో లేకపోవడం.. దీనికితోడు కొన్ని పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ ఆసుపత్రిలో చోటుచేసుకున్న పరిణామాలు వివాదాస్పదం అయ్యాయి. ఒక నిండు గర్భిణిని చేర్చుకోకుండా రెఫర్ చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజాం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులో కూడా స్థాయి పెరిగినా అరకొర వైద్యసేవలే గతి. సరిపడ గదులు లేక ఆరుబయటే ఓపీ చూస్తున్నారు. సీరియస్ కేసులను ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. విలువైన వైద్య పరికరాలు పెట్టేందుకు అవసరమైన భవనాలు లేవు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు భయపడుతున్నారు.

అత్యవసర కేసులు మాత్రమే..

ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి నెల వంద ప్రసవాలు లక్ష్యం కాగా, 60 నుంచి 70 వరకు శస్త్రచికిత్సలతో పాటు సాధారణ ప్రసవాలు చేస్తున్నాం. అత్యవసర కేసులను మాత్రమే జిల్లా కేంద్రానికి తరలిస్తున్నాం. వంద పడకల ఆసుపత్రి అయినా ఇంకా 30 పడకల్లో సేవలు అందజేయాల్సి వస్తుంది.

-డాక్టర్ జగదీష్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్, గజపతినగరం



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

● గత ఏడాది జూలైలో మెంటాడ మండలం రాబంద గ్రామానికి చెందిన కె.లక్ష్మి అనే గర్భిణి చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు విజయ నగరం ఘోషా ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేయించుకుంది. తన బ్లడ్ గ్రూప్‌ను బి-నెగిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. కొద్దిరోజుల తరువాత గజపతినగరం ఏరియా ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సూచన మేరకు మరోసారి రక్తపరీక్ష చేయించుకుంది. అక్కడ బి-పాజిటివ్‌గా నిర్ధారించారు. ఆందోళన చెందిన లక్ష్మి కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో ఆమెకు రక్త పరీక్ష చేయించగా బి-నెగిటివ్‌గా వచ్చింది. దీంతో గజపతినగరం ఏరియా ఆసుపత్రికి వెళ్లి ల్యాబ్ సిబ్బందిని నిలదీస్తే.. అల్లరి చేయొద్దని తప్పు జరిగిందని వేడుకున్నారు.

● గజపతినగరం మండలం తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన నూకరాజు చాతినొప్పితో గత ఏడాది అక్టోబరులో గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో చేరాడు. రోగిని పట్టించుకోకుండా వైద్యు లు, సిబ్బంది కాలయాపన చేయడంతో నూకరాజు మృతి చెందా డని కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేశారు. కొందరు పెద్దలు కల్పించుకోవ డంతో సమస్య సద్దుమణిగింది.

● కొద్దిరోజుల కిందట మెంటాడ మండలం కూనేరు పంచాయతీ మిర్తి వలస గ్రామానికి చెందిన నిండు గర్భిణిని ప్రసవం కోసం 108 వాహనంలో కుటుంబ సభ్యులు గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం 4 గంటల తరువాత ఆసుపత్రిలో వైద్యులు ఉండరని తెలిసి ఎందుకు తీసుకు వచ్చారని 108 సిబ్బందితో వైద్య సిబ్బంది వాగ్వాదానికి దిగారు. ఆమెను విజయనగరం ఘోషా ఆసుపత్రికి తీసుకొని వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చారు. ఆమెను విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 మెడికల్ టెక్నీషియన్ ఆమెకు సాధారణ ప్రసవం చేయడంతో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. గజపతినగరం ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులు, ముగ్గురు గైనకాలజిస్టులు ఉండి కూడా కేసును రిఫర్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. వైద్యులు చెప్పినట్లు హైరిస్క్ కేసు అయితే 108 సిబ్బంది సాధారణ ప్రసవం ఏవి ధంగా చేయగలిగారో వారే చెప్పాలి. ఇక్కడి వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుతున్నారని, దీంతో వారు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను పూర్తిగా విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గజపతినగరం/మెంటాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు అంతంత మాత్రం గానే వైద్య సేవలు అందుతు న్నాయి. 30 పడకలు ఉన్న ఈ ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రిగా మార్పు చేశారు. దీంతో 100 పడకలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్ప టికీ అవసరమైన భవన నిర్మాణాలు ఇంకా పూర్తికాలేదు. దీంతో రోగులకు 30 పడకలపైనే సేవలు అందిస్తున్నారు. ఈ ఆస్పత్రికి గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాలకు చెందిన రోగులు వస్తుంటారు. ప్రతి రోజూ 300 నుంచి 350 వరకు ఓపీ ఉంటుంది. సోమ, బుధ, శుక్రవారాల్లో రోగుల తాకిడి ఎక్కు వగా ఉంటుంది. దీంతో ఆస్పత్రిలో ఉన్న 30 పడకలు సరిపోకవడంతో ఒక బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స అందించాల్సి వస్తుంది. కొన్నిసార్లు జిల్లా కేంద్రాసుపత్రికి లేదా ఘోషా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని రోగుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులను వేరే ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రిలో ముగ్గురు గైనకాలిజిస్టులు ఉన్నా ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయడం ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ 18 మంది వైద్యుల అవసరం కాగా 13 మంది ఉన్నారు. ఐదు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ముగ్గురు వైద్యులు సెలవుల్లో ఉన్నా రు. సీఏఎస్ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, సివిల్ సర్జన్ (ఆర్ఎంవో), ఎంబీఎస్‌యూకు సంబంధించి వైద్యుల కొరత ఉంది. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఉన్న వారిలో కూడా కొందరు సక్రమంగా అందు బాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కనీసం కాల్ డ్యూటీకి అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. హెచ్ఆర్‌పీ పొందుతూ విజయనగరం, విశాఖ నుంచి రాకపోకలు (మిగతా 8వ పేజీలో..)



గజపతినగరం ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలైన్‌లో ఉన్న రోగులు



రాజాం ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న విలువైన వైద్య పరికరాలు

భవనాలు పూర్తయ్యేదెప్పుడో?

రాజాం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రాంతీయ ఆస్పత్రిలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఇది పేరుకే పెద్దాస్పత్రి తప్ప సేవలు మాత్రం ఆ స్థాయిలో లేవు. వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా ఇంకా అస్తవ్యస్త, అరకొర నిర్మాణాలే దర్శనమిస్తోన్నాయి. విలువైన పరికరాలు పెట్టుకునేం దుకు గదులు లేవు. ఆరుబయటే ఓపీ చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర, తెర్లాం, జి.సిగడాం, పొందూరు తదితర మండలాల ప్రజలకు రాజాం ఆస్పత్రే పెద్దదిక్కు. సీహెచ్‌సీగా ఉన్న ఈ ఆస్పత్రిని వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాంతీయ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. అదనపు గదుల నిర్మాణం, వైద్య పరికరాల ఏర్పాటుకు గాను రూ.6.80 కోట్లు మంజూరయ్యాయి. అయితే, ఈ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో జగన్ సర్కారు మొండి చేయి చూపింది. దీంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో ఎక్కడికక్కడే భవన నిర్మాణ సామగ్రి పడి ఉంది. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీకి సంబంధించి 11 రకాల సేవలను ఆరు గదుల్లోనే అందిస్తున్నారు. ఇంకా బ్లడ్ బ్యాంక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌తో పాటు ఇతర గదుల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా మంజూరైన 300 ఎంఎం ఎక్స్‌రే యంత్రాన్ని పెట్టేందుకు గది లేకపోవడంతో దాన్ని ఆస్పత్రి ప్రాంగణంలో వదిలేశారు. బ్లడ్ బ్యాంకుకు సంబంధించిన విలువైన సామగ్రి కూడా ఆరుబయటే నిరుపయోగంగా ఉంది. అత్యవసరవేళ రోగులకు రక్త కావాలంటే శ్రీకాకుళం, తదితర ప్రాంతాల్లోని బ్లడ్ బ్యాంకులకు పరుగెత్తాల్సి వస్తోందని (మిగతా 8వ పేజీలో..)

రీసర్వే కష్టాలు తీరట్లే!

- ఇంకా పరిష్కారం కాని భూ సమస్యలు
- రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న భూ యజమానులు

బొబ్బిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం కాకపోగా మరిన్ని ఎక్కువయ్యాయి. రీసర్వే చేసి రైతులకు సర్వే నెంబర్లకు బదులుగా కొత్తగా ఎల్‌పీఎం నెంబర్లు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఎక్కడ లేని తలనొప్పులన్నీ రైతులకు వచ్చి పడ్డాయి. భూముల రీసర్వే అనంతరం ఆన్‌లైన్ చేసే విధానంలో సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కొంతమందికి భూములు తక్కువగాను, మరికొందరికి ఉన్న భూమి కంటే ఎక్కువగాను రావడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అంతేకాకుండా తాతముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న జిరాయితీ భూములను సైతం బంజరు, డి.పట్టా, గయాళి, పోరంబోకు వంటి పేర్లతో కొత్తగా రికార్డుల్లో చూపిస్తుండడంతో రైతులు లబోదిబోమంటూ రెవెన్యూ కార్యాలయాలు, జిల్లా కలెక్టరు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఊళ్లకు ఊళ్లే ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నాయి. బొబ్బిలి డివిజన్‌లో ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. దీని ఫలితంగా రైతులు తమ పిల్లల వివాహాలు, చదువులు, ఇతర అవసరాల కోసం భూములను అమ్ముకుందామంటే 'ఈ భూమి నీది కాదని' సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చెబుతుండడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా రీసర్వే తప్పులను సరి చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీనికోసం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. అయితే, భూసమస్యలను 70 రోజుల్లోగా పరిష్కరిస్తామని అధికారులు చెప్పినా ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్రభుత్వ భూమి అంటున్నారు..

మా గ్రామ రెవెన్యూ పరిధిలో మా కుటుంబ సభ్యులందరికీ చాలా తరాల నుంచి జిరాయితీ భూమి ఉంది. ఈ భూమిలో సుమారు ఎకరా భూమిని మా ఆర్థిక అవసరాల కోసం అమ్మేశాం. తీరా రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే ఈ భూమి జిరాయితీ కాదు.. 22ఏ లో ఉందని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అంటున్నారు. సుమారు ఏడాది నుంచి తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు తిరుగుతూనే ఉన్నాం. సమస్య తీరిపోతుందని అంటున్నారే తప్ప పని జరగడంలేదు. భూసర్వేతో రికార్డులు తారుమారయ్యాయి. వాటిని వెంటనే సరి చేస్తేనే మాకు న్యాయం జరుగుతుంది.

-కర్రోతు మోహనరావు, శిష్టు సీతారాంపురం, రామభద్రపురం

రికార్డులు తారుమారయ్యాయి..



బొబ్బిలి సరిహద్దు గ్రామం బాడంగి మండలం గొల్లాది రెవెన్యూలో సర్వే నెంబరు 202/1 నుంచి 202/ 18 వరకు ఉన్న 3.73 ఎకరాలను 2011లో సామి రెడ్డి సూరిబాబు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. ఆయన బొబ్బిలి కృష్ణ దగ్గర 2007లో కొనుగోలు చేసి మాకు విక్రయించాడు. ఇవన్నీ రిజిస్ట్రేషన్ ద్వారా సంక్రమించినవే. 2019లో మేము ఈ భూములను పరస్పరం తర్జుమా చేసుకున్నాం. ఆ తరువాత జగన్ ప్రభుత్వంలో రీసర్వేతో భూముల రికార్డులు తారుమారయ్యాయి. తాజాగా 1బీ రికార్డు తీయిస్తే ఒక కాలమ్‌లో వారసత్వపరంగా సంక్రమించిన భూమి అని చెబుతూనే మరో పక్క గయాళి అని కనిపిస్తోంది. ఈ రికార్డులు చూసి మేము షాక్ అయ్యాం. తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మాకు స్పష్టమైన హామీ రావడం లేదు. పరిష్కారం కనిపించడంలేదు. అధికారుల మధ్య పూర్తిగా సమన్వయం కొరవడింది. మరి కొంతమంది ఉద్యోగులకు ఎటువంటి అవగాహన కూడా లేకపోవడంతో మాలాంటి వారమంతా చాలా నష్టపోతున్నాం. దీనికి పరిష్కారం దొరికే మార్గం తెలియక నానా అవస్థలు పడుతున్నాం. కూటమి ప్రభుత్వ హయాంలో వ సమస్య తీరిపోతుందని అనుకున్నాం. రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా భూ సర్వే బాధితులందరికీ పూర్తి న్యాయం చేయాలి.

- బూర అప్పారావు, వెంకటరమణ, బొబ్బిలి

పేదరికం నిర్మూలనకు కార్యాచరణ

- వారిని గుర్తించేందుకు పి-4 సర్వే
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం,కలెక్టరేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు కార్యాచరణ రూపొందించాలని, వారిని గుర్తించేందుకు పి-4 విధానంతో సర్వే చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. మండలాల ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉగాది పర్వదినం రోజున సీఎం చంద్రబాబు ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. దీనికి సమాయత్తం కావాలని కోరారు. 'స్వర్ణాంధ్రలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారిగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. దీని కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమిస్తాం. జిల్లాలో ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాలను రూపొందించాలి. పేదలకు అన్ని విధాలా సహాయ సహకారాలను అందజేసేందుకు ఎన్ఆర్ఐలను, ఆర్థికంగా ఉన్న వ్యక్తులను గుర్తించి, వారిని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. దీనిపై ఫీడ్‌బ్యాక్ సర్వే కూడా జరుగుతుంది. జిల్లా నుంచి సుమారు లక్ష మందికి పై సర్వేలో పాల్గొనేలా చూడాలి. జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలి. దీని కోసం సచివాలయ సిబ్బందిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.' అని కలెక్టర్ సూచించారు. సీపీవో బాలాజీ మాట్లాడుతూ. గ్రామ సభలను నిర్వహించి వివిధ వర్గాలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ వ్యాసరచన పోటీలను నిర్వహించి, వారిని కూడా భాగస్వాములు చేయాలన్నారు. సర్వేను ఈ రోల 22లోగా పూర్తి చేయాలని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల కోసం రూపొందించిన సుగమ్య యాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాల్సిన అంశాలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీ సేతుమాధవన్, జిల్లా వైద్యాధికారి జీవనరాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్



డోలీలో రోగిని ఆసుపత్రికి తరలిస్తున్న గిరిజనులు

డోలీ కట్టి..రోగిని ఆసుపత్రిలో చేర్చి..

- ఎగువమిర్తివలస గిరిజనుల పాట్లు

మెంటాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కూనేరు పంచాయతీ మధుర గిరిజన గ్రామమైన ఎగువమిర్తివలస ప్రజలకు డోలీ పాట్లు తప్పడంలేదు. పొరుగు సిపాయి అనే వ్యక్తి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తెలిసిన వైద్యం అందించినా నయం కాలేదు. దీంతో శుక్రవారం ఆయన్ను సుమారు నాలుగు కిలోమీటర్లు డోలీలో మైదాన ప్రాంతానికి తీసుకువచ్చి అక్కడ నుంచి 108 వాహనం ద్వారా చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. ప్రస్తుతం సిపాయి చికిత్సపొందుతున్నాడు.

పాటలు రాస్తూ.. గానం చేస్తూ..


పాటల రికార్డింగ్‌లో రాము



- జానపదాలతో రాముకు గుర్తింపు
- వీక్షకుల నుంచి విశేష ఆదరణ

చీపురుపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):

కనుమరుగవుతున్న జాన పదాలకు పూర్వ వైభవం తెస్తు న్నాడు ఆ యువ గాయకుడు. ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగిగా.. మరోపక్క గాయకుడిగా రాణిస్తున్నాడు. తన గానంతో పల్లె పాటల్లోని మాధుర్యాన్ని చాటిచెబుతూ దూసుకుపోతు న్నాడు. జనం మెచ్చే జానపదాలను రాస్తూ.. ఆ పాటలకు స్వరాల్ని సమకూరుస్తూ.. స్వయంగా గానం చేస్తున్నాడు. ఆయనే చీపురుపల్లి మండలం పర్ల గ్రామానికి చెందిన ముంగండి రాము. జానపద గానంలో సరికొత్త ఒరవడి సృష్టిస్తున్నాడు. రాము చిన్ననాటి నుంచే పాటలపై మక్కువ పెంచుకున్నాడు. ఎనిమిదేళ్ల వయసు నుంచే పాఠశాలల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. భక్తి గీతాలు, మహిళా చైతన్య గీతాలను ఆలపించేవాడు. అతని గొంతులోని మాధుర్యాన్ని గుర్తించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రాములమ్మ, రాములు, ఇతర కుటుంబ సభ్యులు మరింత ప్రోత్సహించారు. ఐదో తరగతి చదువుతుండగా ఒక ఆర్కెస్ట్రాలో పాడి, అందరి మన్ననలు పొందాడు. అలా మొదలైన పాటల ప్రయాణం, అతన్ని జానపద గాయకుడిగా, రచయితగా, స్వరకర్తగా మార్చింది. 2011లో మాటీవీలో ప్రసారమైన రేలా రేలా (సీజన్-6) ప్రోగ్రాంలో ప్రముఖ జానపద గాయకుడు జానకిరామ్‌తో కలిసి పాడాడు. ఆ కార్యక్రమం ద్వారా వచ్చిన ఆదరణ ఆయనకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. దీంతో ముంద డుగు వేశాడు. స్వర సాధనలో మెలకువలు తెలుసుకొని, తన పాటల ప్రయాణాన్ని పరుగులు తీయించాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల్లో కూడా తన గానంతో పాటల ప్రియులను ఆకట్టు కున్నాడు. ప్రస్తుతం రాము చీపురుపల్లి మండల పేరిపి గ్రామ సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు.

యూట్యూబ్ ద్వారా మరింత ఆదరణ..

రాము రేయింబవళ్లు సాధన చేసి, అంచెలంచెలుగా ఎదిగాడు. 2022లో సొంతంగా యూట్యూబ్ చానెల్ ఏర్పాటు చేశాడు. తాను రాసిన పాటలకు బాణీలు కట్టి, పాడడం మొదలు పెట్టాడు. రామ్ ముంగండి ట్యూన్స్ పేరుతో ఇప్పటి వరకూ సుమారు పాతికకు పైగా పాటలు పాడాడు. ఈ పాటలకు తగ్గట్టుగా గ్రామీణ ప్రాంతాల్లో మంచి లొకేషన్లలో చిత్రీకరించి, యూట్యూబ్‌లో అప్ లోడ్ చేశాడు. ఆయన పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. కనుమరుగవుతున్న పల్లె యాసను, మాండలికాన్ని బతికించాలన్న లక్ష్యంతోనే తాను పాటలు పాడుతున్నట్లు రాము చెబుతున్నాడు.

నేటి నుంచి హజరత్ ఖాదర్‌వలీ బాబా చందనోత్సవాలు


హజరత్ ఖాదర్ వలీ బాబా దర్గా-దర్బార్

విజయనగరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో జరిగే ఆధ్యాత్మిక ఉత్సవాల్లో ఒకటైన విజయనగరంలోని ఖాదర్‌బాబా 66 వ చందనోత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేర కు బాబామెట్టలోని హజరత్ ఖాదర్ వలీ బా బా దర్గా-దర్బార్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి ఖాదర్ వలీ బాబా భక్తులు వేలాది మంది హాజరు కానున్నారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున అధికారికంగా బాబా ఉరుసు ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాదర్‌ను ధర్మకర్త ఖలీల్‌బాబుకు అందించారు. ఈ నెల 8,9,10 తేదీల్లో జరగబోయే ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా గులాబీ పూవులు, అత్తరు, పన్నీరు, సుగంధ ద్రవ్యాలను భక్తులు దర్గాకు సమర్పిస్తారు.

ఉత్సవాలు ఇలా...

శనివారం ఉదయం 6 గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు మహోత్స వాలు ప్రారంభమవుతాయని ధర్మకర్త ఎండీ ఖలీల్‌బాబు తెలిపారు. అనంతరం జెండా మహోత్సవం, చాదర్ సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 9వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనం, నషాన్ చాదర్ సందల్ షరీఫ్‌లతో పకీర్ మేళా, భారీ ఊరేగింపు నిర్వహిస్తామ న్నారు. 10వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో పాటు, తబరుక్ ప్రసాదాల పంపిణీ, సలాం ఖుల్ షరీఫ్‌తో ఉరుసు ముగుస్తుందన్నారు. చందనోత్సవాలకు వచ్చే భక్తులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్టు ఆయన చెప్పారు.

పైసల ప్రాక్టికల్స్!

- సొంత కళాశాలల్లో 'ఇంటర్ ఒకేషనల్' పరీక్షలు
- యాజమాన్యాలకు నచ్చినవారే ఇన్విజిలేటర్లుగా..!
- ఒకరికి బదులుగా మరొకరు పరీక్షలకు హాజరు
- ఓ ఉన్నతాధికారి తనిఖీలో వెలుగుచూసిన వైనం



శృంగవరపుకోట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):

స్థానిక ప్రైవేటు కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించేందుకు గురువారం జిల్లా విద్యాశాఖకు చెందిన ఓ అధికారి వెళ్లారు. మరో కళాశాలలో ఇంటర్ ఒకేషనల్ (వృత్తి విద్య) ప్రాక్టికల్స్ (ప్రయోగ) పరీక్ష కేంద్రంలో ఉండాల్సిన ఇన్విజిలేటర్ ఈ ప్రైవేటు కళాశాలలో కనిపించారు. 'నువ్వు ఇక్కడున్నావేంటి' అని ఆ అధికారి అడిగారు. ఇన్విజిలేటర్ ఓ చిరునవ్వు నవ్వి వెళ్లిపోయారు. దీంతో అక్కడి డిపార్ట్‌మెంట్ అధికారికి చెమటలు పట్టాయి. ఇన్విజిలేటర్ నియామక పత్రంపై రాసిన కళాశాల వివరా లు, ఫొటో చూసి.. నిర్ధారించుకున్న తరువాతనే అతనిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలి. కానీ నియామక పత్రం, గుర్తింపు కార్డు చూడకుండా పరీక్ష కేంద్రంలోకి పంపించేశారు. జిల్లా అధికారి ప్రశ్నించడంతో అక్కడి ఇన్విజిలేటర్ కాదని తెలుసుకున్నారు. కానీ ఇదేమంత పెద్ద విషయం కాదనుకున్నారో... తమ వంతుగా సహకారమందించా రో తెలియదు కానీ జిల్లా అధికారి దీనిని అంతగా పట్టించుకోలేదు. పరీక్ష సాఫీగా పూర్తయిపోయింది. అంతేకాదు.. ఈ కేంద్రంలో ప్రాక్టికల్‌పరీక్షకు హాజరు కావలసిన విద్యార్థికి బదులు వేరొకరిని కూర్చోబెట్టి రాయించినట్టు కూడా తెలుస్తోంది.

..ఇంటర్ వృత్తి విద్య ప్రాక్టికల్ పరీక్షలను ఎంత నిబద్ధతతో నిర్వహిస్తున్నారో చెప్పేందుకు ఈ సంఘటన ఓ ఉదాహరణ. ఈ పరీక్షలను సంబంధిత కళాశాలల యాజమాన్యాల ఇష్టానికి వదిలేస్తున్నారు. దీంతో కొన్ని ప్రైవేటు వృత్తి విద్యా కళాశాల ల్లో ప్రాక్టికల్ పరీక్షల్లో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. దీన్ని నిరోధించాల్సిన విద్యాశాఖ యంత్రాంగం చూసీచూడనట్టు వదిలేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 38 వృత్తి విద్యా కోర్సుల కేంద్రాల్లో 6,017 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ కళాశాలల యాజమాన్యాలు పాఠ్యాంశానికి రూ.500 వంతున విద్యార్థుల నుంచి వసూలు చేసినట్టు సమాచారం. కొంతమంది రూ.1000 వరకు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇలా వసూలు చేసిన డబ్బులను పరీక్షలను పర్యవేక్షించే వారిని లోబర్చు కునేందుకు ఖర్చు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత కళాశాలలు ముందుగానే తమకు అనుకూలమైన ఇన్విజిలేటర్లను నియమించుకునేలా జాగ్రత్త పడుతున్నాయి. దీనికి జిల్లా స్థాయిలోని కొందరు ఉన్నతాధికారులను వివిధ రూపాల్లో ప్రసన్నం చేసుకోవడంతో.. వారి అండదండలు దొరుకుతున్నాయి. దీంతో ప్రాక్టికల్ పరీక్షలపై విద్యార్థులు పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. థియరీకి మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు. ప్రాక్టికల్ పరిజ్ఞానం లేకపోవడంతో సంబంధిత కోర్సులలో ప్రావీణ్యం సంపాదించలేక పోతున్నారు.

జంబ్లింగ్ లేకపోవడంతో...

గతంలో జంబ్లింగ్ విధానంలో (ఒక కళాశాల విద్యార్థులు మరో కళాశాలలో) పరీక్షలు నిర్వహించేవారు. అప్పట్లో కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవలంబించినప్పటికీ ఎంతో కొంతమాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట పడేది. ఈ విధానాన్ని ఎత్తివేయడంతో కళాశాలలు ఆడిందే ఆట గా మారింది. ఏ కళాశాల విద్యార్థులకు అదే కళాశాలను పరీక్ష కేంద్రంగా నిర్ణయించారు. ఇది యాజమాన్యాలకు కలసి వస్తోంది. వృత్తి విద్య విద్యార్థుల్లో చాలా మంది పరీక్షల సమయంలోనే కళాశాలలకు వెళతారు. ఇలాంటి వారంతా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు యాజమాన్యాలు అడిగినంత ఇచ్చేస్తున్నారు. వీరి ని పాస్ చేసేందుకు పాఠ్యాంశాల వారీగా యాజమా న్యాలు ధర లు నిర్ణయిస్తున్నాయి. ఈ రేట్ల ఆధారంగా ఏ కళాశాలలో ఎవరు ఇన్విజిలేటర్‌గా ఉండాలనేది యాజమాన్యాలే నిర్ణయిస్తున్నాయి. ఈ ఒప్పందాలకు సంబంధం లేని అధికారులు పరీక్ష కేంద్రాలకు వెళితే.. ముందుగానే సమాచారం అందుతోంది. మీడియా ప్రతిని ధుల కంట పడితే లోపాలు బయట పడతాయనే ఉద్దేశంతో వారిని పరీక్ష కేంద్రాల వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు.

- పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి పర్యవేక్షణ
- భక్తులతో కిటకిటలాడిన తోటపల్లి
- నేడు సామూహిక కల్యాణాలు


పూజలకు హాజరైన భక్తులు

కన్నుల పండువగా వెంకన్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


మాట్లాడుతున్న విద్యాశంకర భారతి స్వామి


విద్యుత్ కాంతుల్లో దేవస్థానం ప్రాంగణం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వర, శ్రీ కోదండరామ స్వామి దేవస్థానాలు కొత్త కళను సంతరించుకున్నాయి. గత కొన్నాళ్లుగా శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాలు పూర్వవైభవాన్ని సంతరించు కున్నాయి. ఉభయ దేవస్థానాల్లో ఈ నెల 5 నుంచి విగ్రహ పునః ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుప్రభాత సేవ, శాంతి హోమాలు, యంత్ర, ధ్వజ, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ కార్య క్రమాలను నిర్వహించారు. కేవీ నరసింహ చార్యులు, జంధ్యాల జగన్నాథ శాస్త్రి, తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పండి తులు, ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలా చార్యులు తదితరులు ఘనంగా పూజలు చేశారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమాల్లో మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, విశ్రాంత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, జిల్లా దేవదాయశాఖ అధికారి ఎస్.రాజారావు, దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రాంత ప్రజల అదృష్టం..

నాగావళి నదీ తీరాన స్వయంభూగా వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని భారతిస్వామి అన్నారు. దేవస్థానం అభివృద్ధికి విశ్రాంత ప్రభుత్వ కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధుల సేవాభావాన్ని కొనియాడారు.

తరలివచ్చిన భక్తులు..

తోటపల్లిలో నూతనంగా నిర్మించిన స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తర లివచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం సిబ్బంది, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు, జట్టు సంస్థ సిబ్బంది, శ్రీవారి సేవకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.


భారతిస్వామితో రిటైర్డ్ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


కల్యాణ మహోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు..

తోటపల్లి శ్రీ వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో శనివారం స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవంతో పాటు సామూహిక ఉచిత కల్యాణాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణాలకు ముందుగా వచ్చిన వారికి తాళి బొట్టు, పట్టు వస్త్రాలను ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సమకూర్చనుందని ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు.


నూకాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మవరంలో నూకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.


స్వామివారిని గజ వాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

గజ వాహనంపై వేణుగోపాలుని విహారం

బొబ్బిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో వెలసిన వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామి వారిని గజ వాహనంపై పట్టణ వీధులలో మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఆర్‌వీఎస్‌కె రంగారావు ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉదయం సీతారాములు, రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవాలు, సాయంత్రం రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణు గోపాలస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని కార్యనిర్వాహక అధికారి ప్రసాద్ తెలిపారు. ఈ నెల 12న స్వామివారికి పుష్పయాగం, ద్వాదశ కాలార్చన, పూర్ణాహుతి, పవళింపు సేవలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన మహిళలంతా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. సిల్క్ డెవలప్‌మెంట్ ద్వారా 15 ట్రేడ్‌లతో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు శుక్రవారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలోని ఎల్‌డీఎం మూర్తి, డీఆర్‌డీఏ పీఈడీ కల్యాణచక్రవర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్ ఉన్నారు.

బెల్ట్ షాపులను నియంత్రించండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్ట్ షాపులు ద్వారా మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నట్టు సమాచారం ఉందని, వాటిని ఎక్సైజ్ శాఖ అధికారులు నియంత్రించాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ బెల్ట్ షాపులు నియంత్రించలేని పక్షంలో తాను చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేడు వెంకయ్యనాయుడు రాక

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం జిల్లాకు రానున్నట్లు కలెక్టరు అంబేడ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.20 గంటలకు విశాఖ నుంచి కొత్తవలస చేరుకుని, 10-20కు మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టుకు వెళారని తెలిపారు. అక్కడ డాక్టర్ విజయశ్రీ పల్లేటివ్ కేర్ ఆసుపత్రిని ప్రారంభిస్తారన్నారు. 12 గంటలకు మంగళపాలెంలో బయిలదేరి విశాఖ వెళారని ప్రకటనలో పేర్కొన్నారు.

బోరు బావులకు మరమ్మతులు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా నగరంలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కమిషనర్ నల్లనయ్య అన్నారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీ, 52వ నెంబరు సచివాలయం పరిధిలో మరమ్మతులకు గురైన బోరులను బాగుచేయించారు. అలాగే సాకేటివీధిలోని ప్రధాన కాలువలో చెత్తాచెదారాలను తొలగించే ఏర్పాటు చేశారు.

కళాను కలిసిన విద్యార్థులు

గరివిడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును గరివిడి పశు వైద్య కళాశాల విద్యార్థులు శుక్రవారం సాయంత్రం కలిశారు. కళాశాలలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు సానుకూలంగా ఆయన స్పందించి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై శిక్షణ

డెంకాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం పీఎం సూర్య ఘర్ పథకంపై వీవోఏలు, సమాఖ్య నాయకులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఓడ్స్రిగ్రిడ్ సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సోలార్ ప్యానెల్స్‌పై అవగాహన, లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో నమోదు, బ్యాంకు రుణాల ప్రాసెస్, సోలార్ పరికరాల వినియోగం, ప్రభుత్వసాయం, వాయిదాల విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, ఏసీ రాజ్‌కుమార్, జేడీఎం మార్టిన్, ఏపీఎం శ్రీనివాస్ ఉన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి

రాజాం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 ప్రకారం బలవంతపు శ్రమపై నిషేధం విధించడం జరిగిందని, దీన్ని ఉల్లంఘించడం చట్టరీత్యా నేరమని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. ఈనెల 9 వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఇక్కడి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో న్యాయాధికారి పాల్గొన్నారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొండలరావు, ఎస్ఐ రవికిరణ్, న్యాయవాదులు శ్రీనివాస్, గిరిజపతి ప్రసాద్‌తో పాటు పారాలీగల్ వలంటీర్లు, రెడ్‌క్రాస్, మానవత, కార్మికసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.

రైతుకు భూ ఆధార్ తప్పనిసరి

డెంకాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు భూ ఆధార్ తప్పనిసరి అని ఏవో నిర్మల అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో భూ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు గుర్తింపు నెంబరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటివరకు మండలంలో 36 మంది రైతులకు భూ ఆధార్ నెంబర్ క్రియేట్ చేశామన్నారు. వన్-బి, రేషన్ కార్డ్, ఆధార్ లింక్ అయిన ఫోను తీసుకుని రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలన్నారు.

1.12 లక్షల ఎకరాలను సాగులోకి తేవాలి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విని యోగంలో లేని 1.12 లక్షలు ఎకరాల భూమిని సాగులోకి తీసుకుని రావాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. వచ్చే రెండు, మూడేళ్లలో పంటల సాగుకు అనువుగా రూపొందించడం ద్వారా ఈ లక్ష్యాలను సాధించగలమన్నారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి లక్ష్యాల సాధనపై కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి ఉన్నారు.

ధీరవనిత రమాబాయి

రాజాం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి ధీరవనిత అని బహుజన సమాజ్‌వాద్ పార్టీ నాయకుడు బొత్స బుద్ధుడు అన్నారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు జరజాన సీలయ్య, కుప్పిలి అన్నారావు, తేగల మోహన్, తిరుపతిరావు, లక్ష్మి, ఆశస్వాతి ఉన్నారు.

కష్టపడే కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన సర్పంచ్ దత్తినారాయణప్పలనాయుడు, మాజీ సర్పంచ్ దత్తి అప్పలనాయుడుతో పాటు ఆరుగురు వార్డు సభ్యులు, 200 కుటుంబాలు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబుపై నమ్మకంతో పార్టీల చేరిన వారికి, గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. వైసీపీ అరాచాకాల బారిన పడిన కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అలాగే తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నుంచి డిసెంబరు వరకు ఫైల్స్ క్లియరెన్స్‌లో చంద్రబాబు పనితీరు సమీక్షించి తనకు మూడో ర్యాంక్ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్రలో గజపతినగరం నియోజకవర్గానికి ర్యాంక్ రావడం ఆనందదాయకమన్నారు. ఇకపైనా చంద్రబాబు ఆదేశాలు, సూచనల మేరకు నడుచుకుంటానన్నారు. మంత్రికి ఫైల్స్ క్లియరెన్స్‌లో మూడో ర్యాంక్ రావడంపై నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో బొండపల్లి, దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ కృష్ణ, చప్పా చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, పీవీవీ గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్

●విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నగర పరిధిలోని బిట్-1కి చెందిన వైసీపీ నాయకుడు రాయితి లక్ష్మణ ఆయన అనుచరులు, ఆ ప్రాంత మహిళలతో కలిసి వైసీపీని వీడారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమక్షంలో పార్టీ కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



ఎమ్మెల్యే అదితితో పార్టీలో చేరిన వారు

ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

335 మందికి విశ్వకర్మ యోజన రుణాలు

●ఈనెలాఖరులోగా మరో 5,852 మందికి..

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ యోజన కింద జిల్లాలో 307 మందికి రుణాలు మంజూరైనట్టు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఇప్పటికే 307 మందికి చెల్లింపులు జరిగాయని వివరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ యోజనపై ఆయన సమీక్షించారు. 777 పంచాయతీలు, 4 మున్సిపాటీలకు చెందిన సచివాలయాల్లో 86,225 దరఖాస్తులు అందాయన్నారు. మొదటి దశ పరిశీలన తర్వాత అర్హులైన 58,599 మందికి రెండో దశ తనిఖీ కోసం కలెక్టర్ లాగిన్‌కు పంపడం జరిగిందన్నారు. రెండో దశ వెరిఫికేషన్ అనంతరం, మూడో దశ వెరిఫికేషన్ కోసం రాష్ట్ర స్థాయి అధికారులకు పంపడం జరిగిందన్నారు. మూడో దశలోప్రభుత్వం నుంచి 16,330 మందికి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వీరిలో ఇప్పటికే 4,296 మందికి శిక్షణ పూర్తిచేయడం జరిగిందన్నారు. రుణాల కోసం బ్యాంకు లకు 3,241 మందికి దరఖాస్తులను పంపడం జరిగిందన్నారు. వీరిలో 355 మందికి ప్రసుత్తం రుణాలు మంజూరయ్యాయని, మిగిలిన వారికి ఈనెలాఖరికి రుణాలు మంజూరు చేయాలని



ఎల్‌డీఎంను ఆదేశిం చారు. సమావేశంలో జిల్లా సిల్క్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఇండిస్ట్రియల్ ప్రమోషన్ అధికారి శశికళ ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేసి ఇటీవల మృతి చెందిన బి.జగదీశ్వరావు కుటుంబానికి శుక్రవారం ఎస్పీ వకూల్ జిందాల్ హోం గార్డులు పోగుచేసిన ఒక్కరోజు వేతనం రూ.3.25, 890 చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు మృతి చెందితే ఆ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు తోటి హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జి ఆర్.ఐ రమేష్‌కుమార్, డీపీవో సూపరింటెండెంట్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ

పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు

విజయనగరం క్రైం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీస్ శాఖలో వివిధ హోదాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకూల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించి సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. వినతుల పూర్వపరాలను పరిశీలించి త్వరితగతిన చర్యలు చేపడతామని ఎస్పీ హామీ ఇచ్చారు.

వెయిట్ లిఫ్టర్లకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న టీడీపీ సీనియర్ నేత అశోక్, ఎమ్మెల్యే అదితి, టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ 87 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన విజయనగరం క్రీడాకారిణి సత్యజ్యోతి, సీనియర్ మహిళల విభాగంలో 71 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించిన కొండవెలగాడకు చెందిన శనపతి పల్లవిని శుక్రవారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించారు.

● నెల్లిమర్ల: ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 71 కిలోల కేటగిరిలో బంగారు పతకం సాధించిన నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన ఎస్.పల్లవిని టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ శుక్రవారం అభినందించారు.

●విజయనగరం కలెక్టరేట్: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజయం సాధించిన సాయిపల్లవిని నగరంలోని సత్య కళాశాల సెక్రటరీ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు.

మహిళల బాక్సింగ్ జిల్లా జట్టు ఎంపిక

విజయనగరం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా సీనియర్స్ మహిళల బాక్సింగ్ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 20 మంది హాజరుకాగా 10 మందిని ఎంపిక చేశారు.

పుణ్యగిరి జాతరకు పక్కాగా ఏర్పాట్లు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరిలో మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఉమా కోటిలింగేశ్వరస్వామి దర్శన భాగ్యం కల్పించాలని తహసీల్దారు ఎం.అరుణకుమారి దేవాదాయ అధికారులకు సూచించారు. అందుఏకు తగ్గ ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా కల్పించే సదుపాయాలపై ఆరా తీశారు. దారగంగమ్మ లోయ, కొండపైన రైలింగ్‌ను బాగు చేయించాలని ఆదేశించారు. భక్తులకు ఉచిత దర్శనం, రూ.20. రూ.50ల క్యూలైన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పుణ్యగిరి ఆలయ కార్యనిర్వాహక అధికారి తెలిపారు. తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. రెండు రోజులు పాటు జాతర ప్రశాంతంగా జరిగేందుకు బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఎస్.ఐ గంగరాజు తెలిపారు. కొండకు వచ్చే వాహనాలను పుణ్యగిరి రోడ్డులో అనుమతించమని, వాహనాల పార్కింగ్‌కు అవసరమయ్యే స్థలం కేటాయించాలని కోరారు. పుణ్యగిరికు 25 బస్సులు, సన్యాసేశ్వరస్వామి ఆలయానికి 6 బస్సులు మొత్తం 31 బస్సులను నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయాలను కల్పిస్తామని పంచాయతీ ఈవో అనురాధ తెలిపారు. నాలుగు వైద్య శిబిరాలను నిర్వహిస్తామని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి జె.శిరీష అన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండ చూస్తామని ఏఈ రవికుమార్ చెప్పారు. ఎన్నికల డీటీ సునీత, ఈవోపీఆర్డీ వి.విలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దారు

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

రేగిడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రేగిడిలో దత్తపీఠం స్థాపించి ఈప్రాంతానికి ఆధ్యాత్మికసేవలు అందించి గురుస్వామిగా గుర్తింపు పొందిన పారిశ్రామికవేత్త కిమిడి సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని పలువురు వ్యక్తులతో పాటు ఆయన సోదరుడు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు తదితరులు కొనియాడారు. రేగిడి లో శుక్రవారం సత్యనారాయణ సంతాపసభ నిర్వహించారు. కళా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉత్తరాంధ్రకు చెందిన పలువురు ఆధ్యాత్మకవేత్తలు, పీఠాధిపతులు శ్రీనివాసనందస్వామిజీ, బంగారువలసకు చెందిన తారకనంద స్వామిజీ, లైదాం ప్రకాశనందస్వామిజీ, పాలకొండకు చెందిన సామంతులు దామోదరరావు, ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో దశుమంతుపురం త్రినాథరావు, సంస్కృత అధ్యాపకుడు బి.శంకర్రావు, సంతకసింహాచలంతో పాటు కళా అభిమానులు పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

జాతీయ కార్యశాలకు బొద్దూరు టీచర్

సంతకవిటి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో ఈ నెల 11 నుంచి 15 వరకు నిర్వహించనున్న కార్యశాలకు బొద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు ఎంపికయ్యారు. ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో దామోదరరావు ఒకరు. కార్యశాలలో విద్యావిధానంలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల భాగస్వామ్యం కోసం కార్యశాలలో చర్చిస్తారు. దామోదరరావును హెచ్‌ఎం మల్లేశ్వరరావు, ఎంఈవోలు శాంతికుమారి, భాస్కరరావు అభినందించారు.

అరసాడలో అక్రమంగా మట్టి తవ్వకాలు

వంగర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అరసాడలోని పట్నాన చెరువులో అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు. వారం రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటంలేదు. తవ్వకాలను స్థానికులు అడ్డుకున్నా ఫలితం లేకపోతోంది. చెరువులో పెద్దపెద్ద గుంతలు తీసి వదిలేస్తున్నారు. గతంలోనూ ఇలాగే గోతులు తీసి వదిలేయడం వల్ల పశువులు అందులో మునిగి మృతి చెందాయి. మట్టి తవ్వకాలను తహసీల్దారు ధర్మారావు వద్ద ప్రస్తావించగా.. మండలంలో ఎక్కడా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అరసాడలో జరుగుతున్న తవ్వకాలపై సిబ్బందిని అక్కడకు పంపించి విచారణ చేయిస్తానన్నారు.



చెరువులో మట్టి తవ్వకాల దృశ్యం

మహిళను కాటువేసిన తర్వాత పాము మృతి

క్రైం న్యూస్

లక్కవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం లింగంపేట గ్రామంలో శుక్రవారం ఓ విచిత్ర ఘటన జరిగింది. సాధారణంగా పాము కాటుకుగురైన వ్యక్తులు మృతిచెందడం సహజం. కానీ ఇక్కడ కాటువేసిన పాము చనిపోయినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. కాటును గురైన మహిళ చికిత్స పొందుతూ ఆరోగ్యంగా ఉన్నారు. స్థానికుల వివరాల మేరకు.. లింగంపేట గ్రామానికి చెందిన నందిపల్లి సత్యవతి గురువారం రాత్రి భోజనం ముగించుకుని బహిర్భూమి కోసం పక్కనే ఉన్న ముల్ల పొదల్లోకి వెళ్లింది. చీకట్లో పాము కరవడంతో పెద్దకేకలు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఎల్.కోట ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. ప్రాణానికి ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్లు భర్త సన్యాసయ్య తెలిపారు. ఇంతవరకు బాగానే ఉంది. తెల్లవారి తర్వాత స్థానికులంతా పాము కాటు వేసిన ప్రదేశంలో వెదికారు. తీరా చూస్తే పాము మృతి చెంది ఉండడాన్ని వారు చూసి ఆశ్చర్యపోయారు. పాము కాటు వేసిన ఘటనకు దగ్గర్లోనే ఈ పాము ఉండడం గమనార్హం.



మహిళను కాటువేసి చనిపోయిన పాము

●ఈ ఘటనకు సంబంధించి ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. 'అప్పటికే పాము అనారోగ్యంతో ఉండి కాటు వేసిన తర్వాత చనిపోయి ఉండొచ్చు. అలాగే అప్పటికే అది దెబ్బతిని ఉండడం వల్ల కానీ జరిగి ఉండొచ్చు. కానీ మనిషిని కరిచాక పాము చనిపోవడం అనేది సైన్స్‌లో లేదు' అని తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన గోగాడ అరుణ (48) పాము కాటుకి గురై మృతి చెందినట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరా మేరకు.. మృతుడు రమణ గురువారం రాత్రి తన పొలంలో వేరుశెనగ పంటకు నీరు పెట్టడానికి వెళ్లడంతో పాము కాటు వేసినందన్నారు. ఆ గాయంతో రమణ గ్రామంలోకి నడచుకుంటూ వచ్చేశాడన్నారు. గ్రామస్థుల సాయంతో ఎస్.కోట పీహెచ్‌సీకి తరలించారన్నారు. అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్టీసీ బస్సులో..

గజపతినగరం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మెంటాడ మండలం పెదమేడపల్లికి చెందిన మార్పిన రామారావు(57) ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ శుక్రవారం మృతి చెందాడు. రామారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భార్య రాముతో కలిసి వైద్యం నిమిత్తం స్వగ్రామం నుంచి శుక్రవారం విజయనగరం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కారు. గజపతినగరం మండలం మదుపాడ వద్ద రామారావు బస్సులోనే మృతి చెందారు. మృతుడిని గజపతినగరం బస్‌స్టేషన్ ఆవరణలో ప్రయాణికుల సాయంతో దించి స్వగ్రామానికి ఆటోలో తరలించారు.

ఆర్మీ జవాన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రదీప్‌నగర్ సమీపంలోని శివాజీనగర్‌లో నివాసం ఉంటున్న ఆర్మీ జవాన్ కర్రి రమేష్‌పై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. అదే కాలనీలో నివాస ఉంటున్న మహారాజ సింహాచలం అనే మహిళ ఈనెల 5న కర్రి రమేష్ కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేసిందన్నారు. డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

విద్యార్థి అదృశ్యం

తెర్లాం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందబలగ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి అమలాపురం మణికంఠ ఈనెల 4 నుంచి కనిపించడం లేదని తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై ఆయన శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మాట్లాడారు.నందబలగ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువు తున్న మణికంఠ మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో విద్యార్థి తండ్రి చంటి స్థానిక పోలీసులను ఆశ్రయిం చారు. బంధుమిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్టు ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. ఆలయ ధర్మకర్త బెసరా కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బాబా వెండి కిరీటం, వెండి మకర తోరణం, వెండి హారతి కుందెలు అన్నీ కలిసి సుమారు 3.5 కిలోలపైన ఉంటుందని ధర్మకర్త తెలిపారన్నారు. ఎప్పటిలాగే రాత్రికి ఆలయానికి పూజారి తాళాలు వేసి వెళ్లారని శుక్రవారం ఉదయం పూజారి వచ్చేసరికి ఆలయ తాళాలుతీసి ఉండటంతో పూజారి మంథా విష్ణు సమాచారం ఇచ్చారన్నారు. ఘటనపై క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించిందని ఎస్ఐ తెలిపారు.

స్ర్కాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్ర్కాప్ దుకాణంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఆస్తి నష్టం అంచనా వేస్తున్నారు. ● విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

కొమరాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఆశ్రమ పాఠశాల సమీపంలో ఉన్న మలుపు వద్ద కూనేరు వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. శుక్రవారం జరిగిన ఈఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ఎస్ఐ నీలకంఠం తెలిపారు. అయితే లారీ ఢీకొన్న సమయంలో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడం తోనే పెను ప్రమాదం తప్పిందన్నారు. ఆర్టీసీ బస్సులో 17 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

31 మంది ఉపాధి సిబ్బందికి నోటీసులు

వంగర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 31 మంది ఉపాధి సిబ్బంది రూ.83 వేలు దుర్వినియోగం చేశారని తేలటంతో వారికి నోటీసులు జారీ చేశామని డ్వామా కార్యాలయ అధికారి భానుప్రకాశ్ తెలిపారు. శుక్రవారం వంగర కార్యాలయంలో వారిని పిలిపించి నోటీసులు జారీ చేశారు. జూన్‌లో సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన క్షేత్రస్థాయి తనిఖీల్లో అవకతవకలు గుర్తించారన్నారు.నిధుల రికవరీకి పీడీ సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన వెంట డ్వామా కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, ఏపీఎం సత్యవతి ఉన్నారు.

మంత్రులతో కోండ్రు భేటీ

రాజాం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడుతో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ భేటీ అయ్యారు. నియోజకవర్గంలో సమస్యలను వివరించారు. నారాయణపురం, తోటపల్లి మడ్డువలస ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించాలని కోరారు.



మంత్రి నిమ్మలతో మాట్లాడుతున్న కోండ్రు

బాధిత కుటుంబానికి సాయం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట రెల్లివీధిలోని అగ్నిప్రమాద బాధిత శంకరావు కుటుంబానికి టీడీపీ నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, కాపుగంటి వాసు, పెదగాడి రాజు, చెక్క కిరణ్ తదితరులు బియ్యం బస్తా, కూరగాయలు, పప్పు దినుసులు, దుస్తులు అందజేశారు.

అత్యవసర కేసా.. రెఫర్ చెయ్!

(5వ పేజీ తరువాయి)

సాగిస్తున్నారు. భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఒకే గదిలో ఇద్దరు వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలోనే మందులతో ఉన్న అట్టపెట్టెలను ఉంచడంతో రోగులు కూర్చోవడానికి కూడా వీలు లేకుండా పోతుంది. ఇరుకు గదుల్లో సేవలు పొందాల్సి వస్తుంది. గత డిసెంబరులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ ఆస్పత్రిని సందర్శించారు. భవన నిర్మాణాలపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మార్చి నాటికి పనులు పూర్తి చేసి, భవనాన్ని అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. పనులు పూర్తయితే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

భవనాలు పూర్తయ్యేదెప్పుడో?

(5వ పేజీ తరువాయి)



నిరుపయోగంగా ఉన్న బ్లడ్ స్టోరేజీ సామగ్రి

వారి సంబంధికులు చెబుతున్నారు. రోజుకు సగటున అన్ని విభాగాలకు కలిపి ఓపీ 500 వరకూ ఉంటుంది. కానీ, ఓపీ చూసేందుకు కనీసం గదులు లేకపోవడంతో ఆరుబయట, ఆస్పత్రి ప్రాంగణంలో రోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఆస్పత్రిపై స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. త్వరలో పెండింగ్ పనులు పూర్తిచేయించేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

సమస్యలు నిజమే..

ఆస్పత్రిలో సమస్యలు ఉన్న మాట వాస్తవం. అయినా రోగులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలందిస్తున్నాం. ఆస్పత్రి అదనపు గదుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో తొందరగా పనులు పూర్తిచేయడానికి ప్రత్యేకంగా ఇంజనీరును నియమించారు. త్వరలో పనులు పూర్తవుతాయన్న నమ్మకం ఏర్పడింది.

- డాక్టర్ హరిబాబు, సూపరింటెండెంట్, రాజాం ప్రాంతీయ ఆస్పత్రి

బాండెడ్ లేబర్ నిర్మూలనా చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయాధికారి దామోదరరావు

బొబ్బిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బాండెడ్ లేబర్ నిర్మూలనా దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కోర్టు కార్యాలయంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురం సెకెండ్ అడిషనల్ డిస్ట్రిక్ న్యాయాధికారి ఎస్.దామోదరరావు పాల్గొని మాట్లాడారు. 1976లో అమలులోనికి వచ్చిన బాండెడ్ లేబర్ నిర్మూలనా చట్టంలో పొందుపరిచిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోహిణీరావు, లేబర్ అధికారి కె.గౌరీశంకరరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీఎంఎం కుమార్, న్యాయవాదులు, ఎంఎల్ఎస్‌సీకి చెందిన ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పన్నుల వసూలులో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలో ఇంటి పన్నులు, కొళాయి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లు, జీఐఎస్ సర్వే ప్రక్రియలో అలసత్వం చూపితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్ని సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల వారీగా పన్నుల వసూళ్లకు సంబంధించి డిమాండ్ ఎంత.. ఇంతవరకు ఎంత వసూలైంది అనేదానిపై సమీక్ష జరిపారు. కార్యాలయ సిబ్బందితో కలిసి ప్రత్యేక కలెక్షన్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. జీఐఎస్ సర్వే ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు, అడ్మిన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ పూర్తి చేయాలి

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిబ్బగుడ్డివలస గ్రామ సచివాలయాన్ని డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. జియో కోఆర్డినేట్ ట్యాగింగ్‌లో 169 పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మిస్సింగ్ సిటిజన్ రికార్డులలో ఆరోగ్యశ్రీ రికార్డులు, ఎన్ఆర్‌జీఎస్ రికార్డులు గమనించి వాటన్నింటినీ పూర్తిచేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో ఈ టాస్క్ పూర్తి చేయని పక్షంలో సంబంధిత ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సచివాలయ కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్, సచివాలయ కార్యదర్శి పార్వతి, వీఆర్వో రామకృష్ణ, వీఏఏ, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జి గౌరమ్మ జాతర ప్రారంభం

రాజాం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంతకాపల్లిలో మజ్జి గౌరమ్మ జాతర శుక్రవా రం ప్రారంభమైంది. వేకువజామున నాలుగు గంటలకే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరకు శ్రీకారం చుట్టారు. ఒడిశాలోని రాయగడ తరువాత ఈ ప్రాంతంలో ఇక్కడే మజ్జి గౌరమ్మవారి ఆలయం ఉండడం తో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ జాతరలో తొలి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జాతర మహోత్సవాలు జరగనున్నాయి.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం గ్రామంలో రామాలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్త రామమూర్తినాయుడు దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఇరుకు గదిలో.. నేలపైన

- అసౌకర్యాల నడుమ వెంకటరాయుడుపేట ఎంపీపీ పాఠశాల
- అన్ని తరగతులకు ఒకే గదిలో బోధన
- కుర్చీలు లేవు
- బ్లాక్‌బోర్డు లేని వైనం
- తాగునీటికీ ఇబ్బందే
- నిరుపయోగంగా మరుగుదొడ్డి
- పాఠశాల ముందు గోతులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నేడు ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. గతంలో నాడు-నేడు పథకంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం అనేక ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దింది. కానీ ఇప్పటికీ కొన్ని పాఠశాలలు కనీస సౌకర్యాలకు నోచుకోకపోవడం విచారకరం. దీనికి నిదర్శనం బొబ్బిలి మండలం నారసింహునిపేట పంచాయతీ వెంకటరాయుడుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. సుమారు 59 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలకు సరైన భవన సౌకర్యం లేదు. ప్రహరీ లేదు. కనీసం విద్యార్థులు కూర్చోడానికి కుర్చీలు లేవు. పాఠాలు బోధించేందుకు బ్లాక్ బోర్డు కూడా లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యుత్ లేదు. తాగునీటి సౌకర్యం లేదు. తరగతులు నిర్వహించేందుకు ఒకే ఒక చిన్న గది మాత్రమే ఉంది. ఇన్ని అసౌకర్యాల నడుమ విద్యార్థులు, ఉపాధ్యాయులు నెట్టుకొస్తున్నారు. ఈ పాఠశాలలో ఒక హెచ్ఎం, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ మరుగుదొడ్డి ఉన్నప్పటికీ వినియోగించకుండా విడిచిపెట్టారు. ఇదిలా ఉండగా ఈ పాఠశాల చుట్టూ పెద్ద పెద్ద గోతులు తవ్వి ఉన్నాయి. వీటిని ఎవరు తవ్వారు.. ఎందుకు తవ్వారని అడిగితే సరైన సమాధానం లేదు. ఈ గోతుల్లో పడి విద్యార్థులకు గాయాలైతే ఎవరు బాధ్యులు. ఈ పాఠశాల పరిస్థితిని పట్టించుకునే నాథుడే లేడు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ పరిస్థితిని అర్థం చేసుకుని, నిధులు విడుదల చేస్తే పాఠశాల బాగుపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.



ఇదే వెంకటరాయుడుపేట ప్రాథమిక పాఠశాల భవనం



పాఠశాల ముందు తవ్విన గోతులు

గతంలో నిధులు మంజూరు కాలేదు

వెంకటరాయుడుపేట పాఠశాలకు గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో భాగంగా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో మన బడి మన భవిష్యత్తు పథకంలో భాగంగా నిధులు మంజూరవుతయేమో చూడాలి. ప్రహరీ మంజూరయ్యిందేమో.. అందుకే పాఠశాల చుట్టూ తవ్వి ఉంటారు. పిల్లలు పడిపోకుండా సంబంధిత గుత్తేదారు ఏదో ఒకటి అడ్డుగా పెట్టాలి.

- గొట్టాపు వాసుదేవరావు, మండల విద్యాశాఖాధికారి-2, బొబ్బిలి

10న డీవార్మింగ్ డే

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత, పోషకాహార లోపం నివారణ, పిల్లల ఆరోగ్యం మెరుగుకు డీవార్మింగ్ డే దోహదపడుతుందని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం నర్సిపురం ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై వైద్య, విద్య, అంగన్వాడీ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10న నిర్వహించనున్న డీవార్మింగ్ డే కార్యక్రమంలో ఎంతమందికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నారు, ప్రణాళిక వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

- సాలూరు(మక్కువ): మండలంలో ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలలకు ఈనెల 10న ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.హరికృష్ణ, ఎంఈవో పెంట సత్యనారాయణ పాల్గొన్నారు.
- బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల వైద్య శాఖాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10న అన్ని పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీని నియమించండి

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో గత కొన్ని నెలలుగా మండల విస్తరణ అధికారి(ఈవోఆర్డీ) పోస్టు ఖాళీగా ఉంది. ఈవోఆర్డీగా పనిచేసిన కృష్ణుడు పదవీ విరమణ అనంతరం ఈ పోస్టులో ఇప్పటివరకు ఎవరూ చేరలేదు. ఇన్‌చార్జి ఈవోఆర్డీగా ఏవో రమణమూర్తి అదనపు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌గా నియామకమైన పి.లావణ్యమంజీరా డెప్యుటేషన్‌పై చీపురుపల్లి మండలం ఆర్‌డబ్ల్యూఎస్‌కు వెళ్లిపోయారు. ఆ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. అధికారులు స్పందించి పోస్టులు భర్తీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అర్హులకు పథకాలు వర్తించేందుకే భూ ఆధార్

పాలకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పథకాలు సరైన లబ్ధిదారులకు వర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం తీసుకు వచ్చిందని మండల వ్యవసాయ అధికారిణి వై.వాహిని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూ ఆధార్ ఉన్న వారికి మాత్రమే పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తింప చేస్తారన్నారు. ప్రతి భూమి ఉన్న రైతు కింద సూచించిన పత్రాలతో రైతు సేవా కేంద్రాన్ని మార్చి 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదార్‌పాస్ పుస్తకం, వన్‌బీ, ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ చేసిన మొబైల్ నెంబర్, ప్రతి రైతు అశ్రద్ధ చేయకుండా భూ ఆధార్ పొందాలన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలు మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ పార్వతీపురం డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణి అన్నారు. మండలంలోని రేగిడికల్లు ఆశ్రమ గిరిజన సంక్షేమశాఖ పాఠశాలను పార్వతీపురం డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణి శు క్రవారం పరిశీలించారు. మొదట రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. రికార్డులు హాస్టల్ రూమ్‌లను తనిఖీ చేశారు. అనంతరం దుడ్డుకల్లు ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి హిందీ పరీక్షలు

కురుపాం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కురుపాంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు హిందీ పరీక్షలు నిర్వహించనున్నట్టు హిందీ పరీక్ష కేంద్రం వ్యవస్థాపకుడు సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైదరాబాద్ హిందీ ప్రచా ర సభ నిర్వహించే విశారద, భూషన్, ప్రథ మ, మధ్యమ, ఉత్తమ పరీక్షలు ఈనెల 8, 9 తేదీలలో కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా పాఠశాల హెచ్ఎం టి. శంకరరావు, డిపార్ట్‌మెంట్ ఆఫీసరుగా ఎన్. సత్యనారాయణ వ్యవహరిస్తారని చెప్పారు.

కళాకు ఎస్.కోట ఎమ్మెల్యే పరామర్శ



చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావును పరామర్శిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

రాజాం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం రాజాం క్యాంపు కార్యాలయంలో కలిశారు. కళా వెంకటరావు సోదరుడు సత్యనారాయణనాయుడు ఇటీవల అకాల మరణాన్ని చింతిస్తూ ఆయన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కోళ్ల రాంప్రసాద్, కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శ్రీనివాసరావు

కురుపాం/ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరి గ్రామాన్ని ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. రూ.60 లక్షల అంచనా విలువతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని సాకి, కోసంగాడిగూడ, సంధిగూడ, డెప్పిగూడ, కొత్త గూడ గ్రామాల్లోనూ మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ● కురుపాంలో రూ.12కోట్లతో నిర్మించిన ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని గిరిజన ఇంజినీరింగ్ శాఖ చీఫ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈసందర్భంగా భవనానికి ఇంకా కావలసిన అవసరాలను డీఈఈ చాణిక్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే రూ.4కోట్లతో చేపడుతున్న అదనంగా భవనాలను కాంట్రాక్టర్ నిలుపుదల చేయడంపై అడిగి తెలుసుకున్నారు. అలాగే బోరి, బండిగూడలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.మణిరా జు, డీఈఈ చాణుక్య, ఏఈ ఎ.రమేష్, వర్కు ఇన్‌స్పెక్టరు సాలూరు రవికుమార్ పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఆందోళన



నిరసన తెలుపుతున్న బాధితులు

దత్తిరాజేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పెదమానాపురంలో రైల్వే 3వ లైన్ ఏర్పాటుతో ఇళ్లు కోల్పోతున్న బాధితులు రెండో రోజూ శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం నాయకులు, గ్రామపెద్దలు వారికి మద్దతు పలికారు. ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజపతినగరం సీఐ వెంకటరమణ, పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి, బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్, గజపతినగరం ఎస్ఐ లక్ష్మణరావు, బొండపల్లి ఎస్ఐ మహేష్ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించారు. దీంతో వంద రోజుల్లో ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు చేపడతామని తహసీల్దారు విజయభాస్కర్ హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. జడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, సర్పంచ్ గొటివాడ దాను, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు గేదెల మంగమ్మ, నాయకులు గేదెల రామసత్యం, గాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

మార్ట్‌లో సామాన్లు కొంటేనే రుణాలు



ఎంపీడీవో సతీష్‌కు ఫిర్యాదు చేస్తున్న పెదఖండేపల్లి సంఘ సభ్యులు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల్లో రుణాలు కావాలంటే మహిళ మార్ట్‌లో సామాన్లు కొనుగోలు చేయాలని సీసీ మంగమ్మ ఇబ్బందులు పెడుతున్నారని పెదఖండేపల్లి మహిళలు ఆవేదన వెలిబుచ్చారు. ఈవిషయాన్ని శుక్రవారం ఎంపీడీవో సతీష్‌కు ఫిర్యాదు చేశారు. రుణాల మంజూరు కోసం వెలుగు కార్యాలయానికి వెళ్తే పుణ్యగిరి రోడ్డులోని మహిళ మార్ట్‌లో రూ.5వేల విలువ కలిగిన సామాన్లు కొనాలని డిమాండ్ చేశారన్నారు. దాంతో కొన్ని వస్తువులు కొనుగోలు చేశామన్నారు. వాటిని తీసుకుని తిరిగి కార్యాలయానికి వెళ్తే 'రూ.500 సామాన్లు కూడా కొనుగోలు చేయని మీరు రూ.లక్షల్లో రుణాలు ఎలా కడతారు' అని సీసీ వెటకారమడారన్నారు. ఈవిషయంపై వెలుగు ఏపీఎం రమణ వివరణ ఇస్తూ.. సంఘ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన మార్ట్‌లో సామాన్లు కొనుగోలు చేయమని చెబుతున్నామని అన్నారు. తాను శిక్షణలో ఉన్నానని సీసీ మంగమ్మ కూడా ఇదే విషయాన్ని చెప్పి ఉండవచ్చన్నారు. కొనుగోలు చేయాలని ఎవరినీ బలవంతం పెట్టడం లేదని తెలిపారు.

11 నుంచి పింఛన్ల పునః పరిశీలన

బాడంగి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి జూన్ 9వ తేదీ వరకు దివ్యాంగుల పింఛన్లు పునః పరిశీలించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో 1,101 పింఛన్లు పరిశీలనకు వచ్చాయన్నారు. మెంటల్ రిటార్డేషన్ పింఛన్లు 102 ఉన్నాయని వీరికి మార్చి 18, 19 తేదీల్లో విజయనగరంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలన జరపనున్నట్టు తెలిపారు. అలాగే మెంటల్ ఇల్నెస్‌కు సంబంధించి 36 పింఛన్లను ఏప్రిల్ 17న విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, లోకో మోటార్ హ్యాండీక్యాప్డ్‌కు సంబంధించి 486 పింఛన్లను మార్చి 19 నుంచి జూన్ 9 వరకు రాజాం ఏరియా ఆసుపత్రిలో పరిశీలిస్తారని తెలిపారు. కంటికి సంబంధించిన పింఛన్లు 255కి ఫిబ్రవరి 11 నుంచి అదే నెల 24వ తేదీ వరకు రాజాం ఏరియా ఆసుపత్రిలో, వినికిడికి సంబంధించి 222 పింఛన్లు మార్చి 19 నుంచి ఏప్రిల్ 2వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో టీం వన్ వాళ్లు పరిశీలిస్తారని ఆయన వివరించారు.

నూకాలమ్మ పండగ ఖరారు

సాలూరు(పాచిపెంట), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలోని నూకాలమ్మ గ్రామ దేవత పండుగను చేసేందుకు గ్రామ పెద్దలు శుక్రవారం నిర్ణయించారు. ఈ ఏడాది మే 12, 13, 14వ తేదీలలో గ్రామదేవత పండుగ జరిపించుటకు ఖరారు చేశారు. ఈ పండుగ సందర్భంగా మార్చి 23వ తేదీన దేశమ్మతల్లి వారాలు చేసేందుకు నిర్ణయించారు. అలాగే ఏప్రిల్ 13న అమ్మవార్లను (ముగ్గురు) పిలుపు చేయుట, ఏప్రిల్ 29న ముత్యాలమ్మ అనుప పండుగ, మే 12న తోలేళ్ల, 13న నూకాలమ్మ పండుగ, 14న అనుప పండుగ జరిపించుటకు పెద్దలు నిర్ణయించారు. మే 18వ తేదీన లేదా 20న బంగారమ్మ అనుప పండుగ నిర్ణయించుటకు గ్రామ పెద్దలు నిర్ణయించారు.

న్యూస్ బాక్స్

పాఠశాల సందర్శన

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సామరెల్లి ఆశ్రమ పాఠశాలను ఏఎంవో కోటిబాబు శుక్రవారం సందర్శించారు. ఇటీవల జరిగిన పదో తరగతి ఎస్ఏఐ పరీక్షల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి ప్లాంక్‌లను, పెన్నులను అందించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి నగదు బహుమతిని ప్రకటించారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. హెచ్ఎం ఎ.భాస్కరరావు పాల్గొన్నారు.

అతివేగంతో వాహనాలు నడపొద్దు

బెలగాం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో వాహనాలను నడపరాదని ఎంవీఐ ఎస్.రమేష్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీపురంలోని ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లకు, సిబ్బంది రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చవచ్చని అన్నారు. అసిస్టెంట్ ఎంవీఐలు పాల్గొన్నారు.

ఘనంగా సన్యాసమ్మ తీర్థం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వేములాపల్లి గ్రాజు కల్లాల్లో సన్యాసమ్మ తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన జరిగింది. వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.